క్లుప్తంగా

అన్నదానానికి విరాళాలు అందజేత



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మంగళవారం గుంటూరు, ఫిరంగిపురానికి చెందిన నల్లంరెడ్డి భూశంకర్‌రెడ్డి రూ.25 వేలు ఆలయ ఈఓ కిషోర్‌కుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. అలాగే కడప పట్టణానికి చెందిన మకర్ల లక్ష్మీనారాయణ, రూ.10,105 అందజేశారు. పెనుగంచిప్రోలు మండలంలోని గుమ్మడిదుర్రు గ్రామానికి చెందిన కొమరగిరి నాగేశ్వరరావు రూ.5.116 విరాళంగా అందజేశారు. విరాళం అందించిన దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

నిఘా నేత్రంలో ఎంపీడీఓ కార్యాలయం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఇక నుంచి నిఘా నేత్రంలో ఉండనుంది. కార్యాలయం ప్రాంగణం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వరుస చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు, తదితర ఘటనలు జరుగుతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ నితిన్ తెలిపారు. 12 కెమెరాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నిరంతరం నిఘా నేత్రం పర్యవేక్షణలో కార్యాలయం ఉంటుందని, సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

కార్యకర్తల జోలికి వస్తే సహించం

పెనుగంచిప్రోలు: అమ్మవారి చిన్న తిరునాళ్లలో మంగళవారం తెల్లవారు జామున పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణను వైఎస్సార్ సీపీ–పోలీసులకు మధ్య ఘర్షణ అని మాట్లాడటం సరికాదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ అన్నారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ తమ అనుకూల మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. ఘర్షణకు ఎవరు రెచ్చగొట్టారు. దీని వెనక ఎవరు ఉన్నారు. ఎవరు ముందు బాటిల్స్ వేశారో పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఇద్దరి మధ్య ఘర్షణ జరిగితే కేవలం వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకోవటం తగదన్నారు. న్యాయ అన్యాయాలను పరిశీలించి పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ బండ్లను కావాలని మూడు గంటల పాటు నిలిపివేయటం, టీడీపీ వారు రెచ్చగొట్టే పాటలు, డైలాగ్స్ పెట్టటంతో ఘర్షణకు కారణమైందన్నారు. పోలీసులపై దాడిని తాము కూడా ఖండిస్తున్నామన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నికకు ఒక్కరే నామినేషన్



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 27 వ తేదీన జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడి అభ్యర్థిగా అన్నెపాగ సుందరరావు ఒక్కరే నామినేషన్ వేశారు. నామినేషన్ల దాఖలుకు గడువు మంగళవారంతో ముగియడంతో అధ్యక్షుడిగా అన్నెపాగ సుందరరావు ఏకగ్రీవం కావడం దాదాపు ఖాయం అయింది. దీంతో పలువురు న్యాయవాదులు ఆయనకు అభినందనలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

కంచికచర్ల: ఓ కారులో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించటంతో కారు దగ్ధమైన సంఘటన మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం మండలంలోని పరిటాల శివారు దొనబండలో లక్ష్మీ నరసింహ స్టోన్ క్రషర్స్ యజమాని రాజగోపాల్ తన క్రషర్ నుంచి ఇంటికి వెళుతుండగా నేషనల్ హైవేపైకి రాగానే కారులోంచి పొగలు రావటంతో రాజగోపాల్ వెంటనే కారు దిగాడు. ఆ తర్వాత మంటలు వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న స్థానికులు మంటలను ఆర్పివేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

జి.కొండూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులను పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల లాభాలు, రసాయనిక వ్యవసాయం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు.

ప్రమాద ఘంటికలు ▶ మోగిస్తున్న విద్యుత్ స్తంభాలు

- రద్దీ ప్రాంతాల్లో పక్కకు ఒరిగిన స్తంభాలు
- పట్టించుకోని అధికారులు



చందర్లపాడు రోడ్డులోని జెడ్పీహెచ్ఎస్ గోడపై ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం

నందిగామ రూరల్: పట్టణంలోని విద్యుత్ స్తంభాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. రద్దీ కూడళ్లలో సైతం విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి ఉండటంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఊహకందని రీతిలో ప్రమాద తీవ్రత ఉంటుందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వేల సంఖ్యలో వినియోగదారులతో నిత్యం రద్దీగా ఉండే మెయిన్ బజార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇషా ఆస్పత్రి రోడ్డుతో పాటు పట్టణంలోని పలు రద్దీ కూడళ్లలోని విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి నేడో రేపో కూలేందుకు సిద్ధం అన్నట్లు దర్శనమిస్తున్నాయి. మెయిన్ బజార్‌లోని విద్యుత్ స్తంభం దుకాణదారులు నేలపై చేసిన ఫ్లోరింగ్ సపోర్టుతో ఉంది. చందర్లపాడు రోడ్డులోని విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌పార్మర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోడపైకి ఒరిగిన పరిస్థితి నెలకొంది. ఇక ఇషా ఆస్పత్రి రోడ్డులోని విద్యుత్ స్తంభం రోడ్డు సగానికి వాలి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదకరంగా దర్శనమిస్తున్న ఇషా ఆస్పత్రి రోడ్డులోని విద్యుత్ స్తంభం

ప్రమాదం జరిగితే తీవ్రతరమే..

మెయిన్ బజార్‌తో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలకున్న తీగల ద్వారా హైటెన్షన్ విద్యుత్ సరఫరా అవుతుంటుంది. అంతే కాకుండా జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి ట్రాన్స్‌పార్మర్ సైతం ఏర్పాటు చేశారు. మెయిన్ బజార్ వ్యాపార కేంద్రంగా ఉండటంతో నందిగామ, చందర్లపాడు, కంచికచర్ల మండలాలకు చెందిన ఆయా గ్రామాల ప్రజలు రోజుకు వేల సంఖ్యలో వచ్చి వెళ్తుంటారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నున్న విద్యుత్ స్తంభం చందర్లపాడు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉంది. ఈ రహదారి కూడా అత్యంత రద్దీగా ఉంటుంది. అంతే కాకుండా సమీపంలోనే మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాల, తదితర కార్యాలయాలున్నాయి. ఈ రెండు విద్యుత్ స్తంభాల వలన ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఊహకందని విధంగా ప్రమాద తీవ్రత ఉంటుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.



నందిగామ మెయిన్ బజార్‌లో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సుమారు 500 మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సాయంత్రం సమయంలో పాఠశాల ఆవరణలోని వాకింగ్ ట్రాక్‌పై సుమారు 500 మందికి పైగా వాకింగ్ చేసేందుకు వస్తుంటారు. పాఠశాల గోడకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం వల్ల ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు, వాకింగ్ చేసే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యుత్ స్తంభాలకు కూతవేటు దూరంలోనే విద్యుత్ శాఖ కార్యాలయాలున్నాయి. ఆ శాఖకు సంబంధించిన అధికారులు, సిబ్బంది సైతం ఇదే రహదారిలో తిరుగుతుంటారు కానీ విద్యుత్ స్తంభాలను మాత్రం పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో తక్షణమే నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లతో పాటు నివాసిత ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే మెయిన్‌బజార్, చందర్లపాడు రోడ్డు, తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ముప్పల శ్రీను, స్థానికుడు

అధికారులు స్పందించాలి



పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఒరిగిన విద్యుత్ స్తంభాల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందాల్సి వస్తోంది. ముఖ్యంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం గోడ సపోర్టుతో ఉంది. విద్యుత్ స్తంభం పడిపోతే పెను ప్రమాదం జరుగుతుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– పాకాలపాటి కృష్ణ, నందిగామ

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

జగ్గయ్యపేట అర్బన్: మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్మికుల సమావేశం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. గత ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటుచేసి కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసిందన్నారు. మళ్లీ ఈ ప్రభుత్వం కాంట్రాక్టర్ల చేతిలో పెడితే దోపిడీకి తెరలేపడమేనని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ కార్మికులకు నైపుణ్యాలను బట్టి వేతనాలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు పారా ఎలకమ్మ, సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ గౌసమియా, నాయకులు ఎస్.ప్రణయ్, మున్సిపల్ కార్మికులు బుజ్జి, సమాధానం పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారాన్ని అందించాలి

నందిగామ టౌన్: అన్నా క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని రైతు బజార్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాంటీన్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు.

తిరుపతమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆలయం వద్ద పసుపు-కుంకుమల బండ్లు రాగానే భక్త జన సందోహం

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్నతిరునాళ్ల మహోత్సవంలో భాగంగా అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు నుంచి సోమవారం అర్ధరాత్రి రెండు గంటల తరువాత పసుపు-కుంకుమ బండ్లు ఆలయానికి చేరుకున్నాయి. నాలుగు కిలోమీటర్ల మేర రహదారికి ఇరువైపుల వేల సంఖ్యలో భక్తులు పసుపు-కుంకుమ బండ్ల కోసం వేచి ఉన్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి భక్తులు పసుపు-కుంకుమల బండ్ల కోసం ఆసక్తిగా ఎదురు చూశారు. పసుపు-కుంకుమల బండ్లు గ్రామంలోకి చేరగానే భక్తులు జయజయ ధ్వానాలతో స్వాగతం పలికారు. చేతులు జోడించి అమ్మవారికి నమస్కరించి పరవశించి పోయారు. ఆలయం చుట్టూ బండ్లు ఒక ప్రదక్షిణం చేశాయి. ఆలయం వద్ద ఈఓ కిషోర్‌కుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఈ ఎల్.రమ అమ్మవారి వంశీకులు తెచ్చిన పసుపు-కుంకుమలు తీసుకొని వారిని ఘనంగా సత్కరించారు. అనంతం భక్తులకు అమ్మవారి పసుపు-కుంకుమ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఆలయ ఏఈ రాజు, ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు పసుపు-కుంకుమ పంపిణీ చేస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారి పుట్టింటి పసుపు-కుంకుమ కార్యక్రమం సందర్భంగా మంగళవారం తెల్లవారు జామున టీడీపీ, వైఎస్సార్ సీపీ మధ్య జరిగిన ఘర్షణపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రాత్రి ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అధికారులతో మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెనుగంచిప్రోలుకు చెందిన వైఎస్సార్ సీపీ ప్రభను రెండు గంటల పాటు పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో నిలిపి ఉంచటంతో టీడీపీ, జనసేన పార్టీ ప్రభ బండ్లు ఆ సమయంలో అక్కడికి రావటం, డీజేల్లో రెచ్చగొట్టే పాటలు, డైలాగ్స్ పెట్టటంతో పాటు మొదటగా టీడీపీ వాళ్లు చెప్పులు, రాళ్లతో దాడి చేశారని తెలిపారు. దీంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కూడా వేశారని , ఇది టీడీపీ–వైఎస్సార్‌సీపీ మధ్య జరిగిన ఘర్షణమాత్రమే అని పేర్కొన్నారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే సమయంలో ఎవరో రాళ్లు వేయటంతో పోలీసులకు గాయాలవ్వటం దురదృష్టకరమన్నారు. దాడిలో వైఎస్సార్ సీపీ మాజీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావుతో పాటు కొందరు కార్యకర్తలకు కూడా గాయలయ్యాయన్నారు. అయితే ఘటనకు సంబంధించి కేవలం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఇప్పటి వరకు తొమ్మిది మందిని విచారణకు పలిపించి కూర్చోబెట్టటం సరైనది కాదన్నారు. ఘర్షలో టీడీపీ వారు కూడా ఉన్నారని, సక్రమంగా పరిశీలన చేసి వారిని కూడా గుర్తించాలన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, మండల అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, న్యాయవాది పసుపులేటి సత్యశ్రీనివాస్, నాయకులు చౌడవరపు జగదీష్, కాకాని హరి, కన్నమాల శామ్యూల్, నంబూరి రవి, ఉన్నం శ్రీనివాసరావు, నరసింహారావు, ఎ శ్రీనివాసరావు, బి బ్రహ్మం, సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

సీపీఎం నాయకులు

మైలవరం: సాగర్ జలాలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వీరాస్వామి, ఎం. మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులు దాళ్వా పంట, మెట్ట పంటలను వేశారని, చెరువుల్లో నీరు లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ సమయంలో సాగర్ జలాల కోసం రైతులు, పశువుల యజమానులు ఎదురు చూస్తున్నారన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం ప్రకారం ఏప్రిల్ నెలాఖరు వరకు సాగర్ జలాలు రావలసి ఉన్నప్పటికీ ఇంకా నీరు విడుదల చేయలేదని, కనుక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి వెంటనే సాగర్ జలాలను విడుదల చేయించాలని కోరారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ ఎం. సతీష్‌కుమార్‌కు నాయకులు అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వీరాస్వామి, నాయకులు పాల్గొన్నారు.

భూ సార పరీక్షలు చేయించుకోవాలి



కొత్తపేటలో కందిపంటను పరిశీలిస్తున్న ఏఓ విజయకుమార్, రైతులు

కంచికచర్ల: పంటలు సాగుచేయక ముందే పొలాల్లో భూ సార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కే విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంటలను సాగుచేసే ముందు రైతులు తమ పొలాలను భూ సార పరీక్షలు చేయించుకోవాలన్నారు. రాయితీపై కిసాన్ డ్రోన్‌లు రైతులకు మంజూరు చేస్తారన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక ఫలసాయం పొందవచ్చని తెలిపారు. ఆధునిక వ్యవసాయ సమాచారం, ఆరోగ్యాన్ని ఏవిధంగా కాపాడతామో అదేవిధంగా పంటలను రక్షించుకోవాలో తెలియజేశారు. అనంతరం క్షేత్ర దర్శనంలో భాగంగా కందిపంటను రైతులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామీణ వ్యవసాయ సహాయకులు రుచి, సాహిత్య పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై అసభ్య ప్రవర్తన

జి.కొండూరు: మానసిక వికలాంగురాలైన బాలికపై తండ్రి వరసైన వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై జి.కొండూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జి.కొండూరు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బి. రవీంద్రబాబు అనే వ్యక్తి విజయవాడకు చెందిన ఇద్దరు పిల్లలు ఉన్న మహిళతో గత ఐదేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. కాగా రవీంద్రబాబు సదరు మహిళ కుమార్తె (11)తో సోమవారం అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇదే విషయం బాధిత బాలిక తల్లికి చెప్పడంతో జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉంటే నిందితుడు రవీంద్రబాబు సోమవారం రాత్రి ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు రవీంద్రబాబుని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పోలీసుల పర్యవేక్షణలో నిందితుడు రవీంద్రబాబు చికిత్స పొందుతున్నాడు.

రైతులు సాంకేతికతవైపు అడుగులు వేయాలి

మక్కపేట(వత్సవాయి) : రైతులు వ్యవసాయంలో మూస పద్ధతులను వదిలివేసి సాంకేతికత వైపు అడుగులు వేయాలని కేవీకే ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ కే అచ్యుతరాజు పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పని అనుభవంలో భాగంగా రైతులతో కలిసి పంట పొలాలను గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మిర్చి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద గ్రామ చిత్రపటం వేశారు. గ్రామంలో ముఖ్యమైన ప్రార్థనాలయాలు, గ్రామ వనరుల గురించి రైతులకు వివరించారు. అనంతరం కేవీకే ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులను తగ్గించి పశువులను ఎరువులను ఎక్కువగా వాడుకోవాలన్నారు. అదేవిధంగా తప్పనిసరిగా పంట మార్పిడి విధానం చేపడితే దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కొండబోలు వెంకటబ్రహ్మం, గోళ్ల తిరుపతయ్య, కొండబోలు శ్రీను, కనగాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు



మక్కపేట చిత్రపటం గురించి రైతులకు వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

రైతు సమస్యలు తెలుసుకోవాలి

గంద్రాయి(జగ్గయ్యపేట): వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామాల్లో రైతుల సమస్యలను తెలుసుకోవాలని కేవీకే కో–ఆర్డినేటర్ అచ్యుతానంద రాజు పేర్కొన్నారు. కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం గంద్రాయి గ్రామంలో పర్యటించి రైతు సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రామాల్లో 15 రోజుల పాటు పర్యటించి వ్యవసాయాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారన్నారు. అనంతరం గ్రామ చిత్ర పటాన్ని ప్రదర్శించారు. కేవీకే శాస్త్రవేత్తలు రాజశేఖర్, శివప్రసాద్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



గంద్రాయి గ్రామ చిత్ర పటాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

వేపలవాగును ప్రక్షాళన చేయాలి

జగ్గయ్యపేట అర్బన్: వేపలవాగులో ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి ఆ ప్రాంత ప్రజలకు మంచి వాతావరణంతో కూడిన వేపలవాగుగా ప్రక్షాళన చేయాలని మున్సిపల్ 5 వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ పేర్కొనఆనరు. 5,6,7 వ వార్డుల పరిధిలో ప్రవహిస్తున్న వేపలవాగును మంగళవారం ఆయన పరిశీలించారు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేపలవాగులో పేరుకుపోయి మురికినీరు ప్రవాహం లేక ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. దోమలు వృద్ధి చెంది ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇదే సమస్యను గత నెల క్రితమే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. దీంతో మంగళవారం జేసీబీ సాయంతో వేపలవాగులో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి మురికి నీరు దిగువకు ప్రవహించేలా చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ నెల క్రితం ఫిర్యాదు చేస్తే ఇప్పుడు వచ్చి తాత్కాలిక ప్రాతిపదికన ఒక అరగంట మాత్రమే జేసీబీతో పనిచేయించి వెళ్లిపోయారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకువచ్చామని, పూర్తిగా వేపలవాగులో ఉన్న వ్యర్థాలను పొక్లెయిన్, ట్రాక్టర్ల ద్వారా బురదనంతా తొలగించాలని కోరారు.



వేపలవాగులో చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న వట్టెం మనోహర్

సమస్యల పరిష్కారానికి కృషి

వీరులపాడు: వీఆర్వోలు ఆయా గ్రామాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ హుసేన్ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు గ్రామాల్లోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సాయినగర్‌లో ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



సాయినగర్‌లో సమస్యలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని షేర్‌మహ్మద్‌పేట రోడ్‌లోని సాయినగర్‌లో ఉన్న ఇళ్లకు పట్టాలు ఇప్పించాలని సీపీఎం నాయకులను ఆ కాలనీవాసులు కోరారు. మంగళవారం సాయినగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సాయినగర్‌లో 30 ఏళ్ల క్రితం 196 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, రెండేళ్ల క్రితం దేవదాయశాఖ వారు తమకు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారని కాలనీవాసులు తెలిపారు. ఇది చాలా దారుణం అని, తక్షణమే ప్రభుత్వం తాము నివాసం ఉంటున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌సీహెచ్. శ్రీనివాస్, పేట మండల, పట్టణ కార్యదర్శి ఎస్.నాగమణి, నాయకులు కోట కృష్ణ, దంతాల రాజేశ్వరి, జె.వెంకట్రావు పాల్గొన్నారు.